సకల శుభాల సంక్రాంతి

- వాకిళ్ల ముంగిట రంగవల్లులు
- పతంగుల కోలాహలం
- కానరాని హరిదాసుల సందడి

షాబాద్: సంక్రాంతి అనగానే తెలుగింటి ఆడపడుచుకు వెంటనే గుర్తుకు వచ్చేవి ముగ్గులే. పండుగకు మూడు రోజుల ముందుగానే ప్రతీవాకిలి ముంగిట రంగవల్లులతో కళకళలాడుతూ ఉండటం మనకు తెలిసిందే. ప్రతి ఇంటి ముంగిట ముగ్గులు వేయడం పరిపాటి. ప్రతి వాకిళ్ల ముందు ముగ్గులు వేస్తే లక్ష్మీదేవి కళకళలాడుతుందనేది చెబుతుంటా. ఇది ప్రజల నమ్మకం. స్త్రీల సృజనాత్మకతకు, కళాతృష్ణకు ప్రతీకలుగా రంగవల్లులను పేర్కొంటారు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు ప్రజలు ఈ పండగ సందర్భంగా సందడి చేస్తారు. ఈ పండగ ప్రత్యేకత రైతు పండించిన పంట ఇంటికొచ్చాక జరుపుకునే తొలి పండగ అని చెప్పొచ్చు. అందుకే ఊరూవాడ భేదం లేకుండా సంక్రాంతి సంబురాలు జరుపుకుంటారు.

పశువులను పూజించి..

సంక్రాంతి పండగ మర్నాడు కనుమ వస్తుంది. పశువులను, కోడే దూడలను అలంకరించి, పూజిస్తారు. కనుమనాడు ఇంటికి వచ్చిన కూతుళ్లను, ఆడపడుచులను ప్రయాణాలు చేయనివ్వరు. ఈ కనుమను పీడ అని పలువురు అభివర్ణిస్తారు. ఈ పండగ రోజు కాకి కూడా కదలదని శాస్త్రాలు గోశిస్తున్నాయి.


షాబాద్‌లో డూడూ బసవన్న

సందడి తగ్గిన వేడుక

అందాల పొదరిళ్లు, రంగవల్లుల లోగిళ్ల, పిండివంటల ఘుమఘుమలు, కొత్త బట్టల సింగారాలు ఈ పండగ ప్రత్యేకత. ముఖ్యంగా రైతుల ఇళ్ల ముంగిళ్లలో సందడే సందడి చోటు చేసుకుంటాయి. కానీ ఈ ఏడాది అది కాస్త తగ్గినట్టు పలువురు చెబుతున్నారు. ఏడాదికోసారి వచ్చిపోయే ముఖ్య అతిథి డూడూ బసవన్న గంగిరెద్దులయ్య మాటలకు లయబద్ధంగా కాళ్లు కదుపుతూ తలాడించే ముస్తాబు చేసిన ఎద్దు ఈ పండుగకు వన్నెతెస్తుంది. ఈ సారి అది కానరాలే. ఏదిఏమైనా తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను చాటే పండగ మళ్లీ వచ్చేసింది. ఇళ్ల ముందర ముగ్గులు, పాలు పొంగించే కార్యక్రమాలతో పండగను ప్రజలు జరుపుకుంటున్నారు. ఇక సంక్రాంతి సందర్భంగా యువకులు ఎగరవేసే పతంగులు ఈ సారి ఆకాశంలో అంతగా కనిపించడం లేదు. సంక్రాంతి సూచికగా ఇళ్ల ముందరకు వచ్చే గంగిరెద్దులవారు, హరిదాసుల వారి సందడి సైతం తగ్గింది.

క్లుప్తంగా


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవా లని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ పార్వతమ్మ ఆధ్వర్యంలో వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లను, యువకులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవచేయడానికి ముందుండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జంగయ్యయాదవ్, పద్మ, గిరిజ, సంజయ్, ప్రవీణ్, రమేష్‌యాదవ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ


సురంగల్ చర్చిలో చీరలు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రైస్తవ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆదివారం సురంగల్‌లోని మెథడిస్ట్ చర్చిలో కాంగ్రెస్ నాయకుడు గడ్డం వెంకట్‌రెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, ఇతర నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


విజేతకు బహుమతి అందజేస్తున్న రమేశ్

షాద్‌నగర్: మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో రామలింగేశ్వర పాదుపు సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ లక్ష్మి రమేశ్ హాజరై మాట్లాడారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘం అధ్యక్షుడు కృష్ణాజీ, పురుషోత్తంరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మల్లేశ్ పూజారి, రాకల మల్లేశ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్ సరఫరా చేయండి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి


పెట్రోల్ బంకు ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ సరఫరా చేయాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో సర్పంచ్ చందిప్ప జంగయ్య, కుమ్మరి దర్శన్, ఈదుల కృష్ణగౌడ్, శకుంతలతో కలిసి పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల అవసరాల దృష్ట్యా షాబాద్‌లో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీటీసీ మద్దూరు పాండు, సుదర్శన్, చెన్నయ్య, పెంటయ్య, రాజేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఎస్ఈ విద్యార్థి ప్రతిభ అభినందనీయం

మొయినాబాద్‌రూరల్: రాయల్ మిస్టర్ ఇండియా పోటీల్లో కేఎల్ యూనివర్సిటీ సీఎస్ఈ విద్యార్థి అన్సర్ ప్రతిభ అభినందనీయమని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధి వర్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థికి అభినందన సభ నిర్వహించారు.

ఇంటింటికీ రాములోరి అక్షితలు


చేవెళ్ల: ముడిమ్యాలలో అయోధ్య అక్షితలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

మొయినాబాద్/చేవెళ్ల: అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల గ్రామంలో ఆదివారం అయోధ్య అక్షితల పంపిణీ చేపట్టారు. గ్రామంలోని రామమందిర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జనజాగరణ కార్యక్రమం నిర్వహించారు. రామనామంతో భజన కీర్తనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. గడపగడపకు అక్షితలు అందజేశారు.

షాబాద్: ఇంటింటికీ రాములోరి అక్షితలు పంపిణీ చేస్తామని సర్దార్‌నగర్ సర్పంచ్ మునగపాటి స్వరూప పేర్కొన్నారు. సర్దార్‌నగర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో శ్రీరాముడి అక్షితల శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ అక్షితలను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. అయోధ్యలో నిర్మితమవుతున్న శ్రీరామముడి ఆలయ ప్రాణప్రతిష్ఠ సమయంలో వేసిన అక్షితలను దేశవ్యాప్తంగా హిందువుల గృహాలకు చేర్చాలని శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఆ అక్షితలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇందిరమ్మ, వార్డు సభ్యులు నర్సింహులు, కృష్ణ, జగదీశ్వర్, హరీశ్ రఘు, ప్రదీప్, చంద్రశేఖర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిగూడలో..

అయోధ్య శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ అక్షితల పంపణీ నిర్వహిస్తున్నట్లు మల్లారెడ్డిగూడ సర్పంచ్ చందిప్ప జంగయ్య పేర్కొన్నారు. మల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయంలో శ్రీరాముని అక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో ఆలయ నిర్మాణం హిందువుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజు, రాజుగౌడ్, నర్సింహులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్


మొయినాబాద్‌రూరల్: క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ రమేశ్

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే యువతకు, విద్యార్థులకు మంచి గుర్తింపుతో పాటు భవిష్యత్ ఉంటుందని మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యసాధన కోసం అహర్నిషలు కృషి చేయాలన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో వారికి పోలీస్, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగఅవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ధాక్యనాయక్, జంగయ్య, రవీందర్‌రెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు, కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ గోటికే రమేశ్ పేర్కొన్నారు. సంక్రాంతి పురస్కరించుకొని మండల స్థాయిలో క్రికెట్ పోటీలను గోల్కొండ క్రికెట్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరు గెలుపోటములు సహజంగా తీసుకోవాలన్నారు. క్రీడలు శరీర ధారుడ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామాల్లో నైపుణ్యమున్న క్రీడాకారులను ప్రొత్సహించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గోటికె శ్రీకాంత్, రంజిత్‌గౌడ్, చైన్‌ఖాన్, యండీ జాహిద్, ముజామిల్, రోహిత్‌ముదిరాజ్, కటికే సంతోష్, సుదర్శన్ రెడ్డి, బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

మొయినాబాద్/చేవెళ్ల: రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న అవర్లీ బెస్ట్ టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీచర్స్ శ్రీనివాస్‌గౌడ్, రమేష్, శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం మోడల్ స్కూల్ టీచర్లు టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో 1,241 మంది టీచర్స్ పనిచేస్తున్నామని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. దీనిపై కోదండరామ్ సానుకులంగా స్పందించినట్టు వారు తెలిపారు.


ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతి పత్రం ఇస్తున్న మోడల్ స్కూల్‌టీచర్స్

పోరుగర్జన కరపత్రాల ఆవిష్కరణ



కందుకూరు: తెలంగాణ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29న చేపట్టనున్న పోరుగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం సభ్యులు ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేడి మహేష్‌మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజుమాదిగ మాట్లాడుతూ.. డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్లు ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. వచ్చే నెల 29న రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బహిరంగ సభకు భారీ సంఖ్యలో మాదిగ, మాదిగ ఉప కులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, నాయకులు నరసింహామాదిగ, కృష్ణమాదిగ, జంగయ్యమాదిగ, నరసింహామాదిగ, యాదయ్య, సురేశ్ పాల్గొన్నారు.

వెల్జాల్‌లో అక్షితల శోభాయాత్ర

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో సర్పంచ్ సంగీత ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి అయోధ్య అక్షితలు అందజేశారు. అక్షితలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, విష్ణువర్ధన్ యాదవ్, నరేందర్‌గౌడ్, శ్రీను, నర్సిరెడ్డి, సుదర్శన్, ఆంజనేయులు, చెన్నయ్య, విజయ్‌కుమార్, రాఘవేందర్, సుధాకర్, రాజు, లింగం, రామస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

వైస్ ఎంపీపీ అనంతరెడ్డి

ఆమనగల్లు: అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి కోరారు. ఆమనగల్లు మండలం మంగళపల్లిలో మండలపరిషత్ నిధులు రూ.1.75 లక్షలతో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డితో కలిసి అనంతరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. మంగలపల్లి, చింతలపల్లిలో ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయికుమార్, మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాయకులు సురేందర్‌రెడ్డి, అంతయ్య, కొండల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న అనంతరెడ్డి

ఆర్థికసాయం అందజేత

యాచారం: చిన్ననాటి స్నేహితుడి కుటుంబ సభ్యులకు తోటి స్నేహితులు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. వివరాలు... మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన బైకని అశోక్ కొద్దిరోజుల కింద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కందుకూర్ మండలం మీరాఖాన్‌పేట ఉన్నత పాఠశాలలో అశోక్ పదోతరగతి చదివాడు. అశోక్ చిన్ననాటి స్నేహితులు ఆదివారం కుర్మిద్ద గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో సురేష్, శ్యామ్, మహేందర్‌రెడ్డి, నరేష్, శ్రీకాంత్, ప్రశాంత్, భరత్, కిరణ్, కల్పన, వసంత తదితరులు ఉన్నారు.


నగదు అందజేస్తున్న స్నేహితులు

ఘనంగా గోరంగనాయక స్వామి కల్యాణం


మొయినాబాద్: గోదా కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: పచ్చని తోరణాలు, వేదపండితుల మధ్య గోరంగ నాయక స్వామి కల్యాణాన్ని ఘనంగా ఆలయ పూజారులు నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని కనకమామిడి సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోరంగనాథ స్వామి కల్యాణాన్ని ఆలయ చైర్మన్ లక్ష్మికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేశారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజలో బల్వంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కండిక రమేశ్, మాజీ సర్పంచ్ గోడూరు లక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య చిలుకూరు బాలాజీ దేవాలయంలో గోదా కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ధనుర్మాసం చివరి రోజైన భోగి పండుగ రోజు గోదా కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం చేపడతారు. అందులో భాగంగా చిలుకూరు బాలాజీ దేవాలయంలో ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకే స్వామివారికి ధనుర్మాస ఆరాధన చేపట్టారు. అనంతరం ఆలయం వెనకభాగంలో ఉన్న అద్దాల మహాల్‌లో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను మండపంలో ఆసీనులను చేసి గోదా కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, అర్చకులు నరసింహన్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి


షాబాద్: కుమ్మరిగూడలో భోగి మంట


మొయినాబాద్‌లో..

నియోజకవర్గంలో ఊరువాడ, చిన్నా, పెద్దా ఆదివారం భోగిని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం భోగి మంటలు వేశారు. సాయంత్రం పతంగులతో సందడి చేశారు. మహిళలు ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేశారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింభించేలా ప్రజలు జరుపుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఆటలో గెలుపోటములు సహజం

మహేశ్వరం: ఆటలో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన వారు వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలని మహేశ్వరం ఏసీపీ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెండ్యాలలో నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. దీనికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల పట్ల చొరవ చూపాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతాయన్నారు. గ్రామంలో 24 ఏళ్ల నుంచి నవభారత్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సట్టి బాలకిష్టమ్మ /ాపకార్థం కుమారులు రామిరెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, అంజిరెడ్డిల సహకారంతో పోటీలు నిర్వహించారన్నారు.

60 జట్లు పాల్గొనగా..

పోటీల్లో మొత్తం సుమారు 60 జట్లు పాల్గొన్నారు. ఫైనల్ పోరులో నాగిరెడ్డిపల్లి, రావిర్యాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. విన్నర్‌గా నాగిరెడ్డిపల్లి, రన్నర్‌గా రావిర్యాల జట్లు గెలుపొందాయి. పాఠశాల విభాగంలో మొదటి బహుమతి కేశంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి వివేకనంద హైస్కూల్ మన్సాన్‌పల్లి జట్లు విజయం సాధించాయి. తాడు లాగుడు పోటీలో విన్నర్‌గా మహేశ్వరం జిమ్, రన్నర్‌గా పెండ్యాల జట్లు గెలుపొందాయి. విజేతకు రూ.30,000, ద్వితీయ స్థానానికి రూ.15 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సీఐ ముని, నవభారత్ యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు రాజేశ్, యాదయ్య గౌడ్, సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, హన్మంత్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, బాల్‌రాజ్, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వజ్రంరెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ యాత్ర విజయవంతానికి పూజలు

బడంగ్‌పేట్: రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' విజయవంతం కావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలిసి బడంగ్‌పేట్‌లోని కాశీబుగ్గ దేవాలయంలో ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకొని 1,116 కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం మేయర్ పారిజాత మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర ప్రజల ఆశీర్వాదంతో విజయవంతంగా పూర్తి కావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, రామ్‌చందర్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలకృష్ణ, రాకేశ్, భాస్కర్ రెడ్డి, కిరణ్, మహిళలు పాల్గొన్నారు.